క్లుప్తంగా

విద్యుత్ సిబ్బందిని అభినందించిన డీఈ



ధర్మసాగర్: మండలంలోని నారాయణగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ శాఖ సిబ్బందిని డీఈ సామ్య నాయక్ అభినందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో గృహకనెక్షన్లు అన్నింటికీ మీటర్ ద్వారానే వినియోగం జరుగుతుందని తెలిపారు. ఎవరు కూడా అనధికారికంగా విద్యుత్ వినియోగించుకోవడం లేదని తెలిపారు. ఏడీఈ రాజు, ఏఈఈ కుమారస్వామి, సబ్‌ఇంజనీర్ మణిదీప్, ఎస్ఎల్ఐ కనకయ్య, ఎల్ఐ ఆంజద్, ఎల్ఎంఎస్ శ్రీనివాస్, సారయ్య, మహేందర్, సంజీవ, జెఎల్ఎంఎస్, సీఎల్ఎస్‌లతో పాటు సెక్షన్ సిబ్బందిని డీఈ అభినందించారు. ఇలాగే తమ సేవలను ఎల్లవేళలా కొనసాగించాలని సూచించారు.

విచారణకు హాజరుకావాలి

దామెర : నాగ్‌పూర్-విజయవాడ ఎక్స్‌ప్రెస్ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులు విచారణకు హాజరుకావాలని తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 3 నుంచి 6 వరకు పరకాల ఆర్డీఓ కార్యాలయంలో జరిగే విచారణకు భూములు కోల్పోతున్న రైతులు భూములకు సంబంధించిన ఒరిజినల్ పట్టా పాస్‌పుస్తకాలు, జిరాక్స్ కాపీలతో హాజరుకవాలని కోరారు. 3న పులుకుర్తి, 4న పసరగొండ, 6న ఊరుగొండ రైతులు హాజరు కావాలని సూచించారు.

విరాళం అందజేత




దామెర : మండలంలోని ల్యాదెళ్ల శ్రీ వేంకటేశ్వర ఆలయ మండపం నిర్మాణం కోసం బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. గ్రామంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో భాగంగా గ్రామ పెద్ద మహిపాల్‌రెడ్డి ఈ మేరకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విజయచందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు గ్రామాభివృద్ధికి తన సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జంగిలి నాగరాజు, నియోజకవర్గ కో కన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, ప్రధానకార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మాందాటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి



శాయంపేట : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో గురువారం నిర్వహించనున్న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు మండలంలోని బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అన్నారు. సభకు మండల పరిధిలోని గ్రామాల పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

సంఘం అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



ఎల్కతుర్తి: మండలంలోని గోపాల్‌పూర్‌లో సంఘమిత్ర పురుషుల పొదుపు సంఘం నూతన అధ్యక్షుడిగా కంచర్ల కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పొదుపు సంఘం సమితి అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పొదుపు సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆయన ఎన్నికపై పలు వురు సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

డీఈఓ అనుమతి లేకుండా విహారయాత్ర!

విద్యారణ్యపురి: డీఈఓ అనుమతి లేకుండా మడికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని కొందరు విద్యార్థులను హెచ్‌ఎం, పలువురు ఉపాధ్యాయులు బుధవారం విహార యాత్రకు తీసుకెళ్లినట్లు సమాచారం. సుమారు 45 మంది విద్యార్థులు, 8 మంది ఉపాధ్యాయులు రామప్ప, లక్నవరం, మల్లూరు ప్రాంతాలకు విహార యాత్రకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈవిషయమై డీఈఓ ఎండి అబ్దుల్‌హైని 'సాక్షి' వివరణ కోరగా.. ఈవిషయం తన దృష్టికి వచ్చిందని వివరణ ఇవ్వాలని హెచ్‌ఎంను ఆదేశించినట్లు అబ్దుల్‌హై వివరణ ఇచ్చారు.

ప్రజలను మోసగించేందుకే బీఆర్ఎస్ డ్రామా

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



పరకాల : మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

పరకాల: మరోసారి తెలంగాణ ప్రజలను మోసంచేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ పేరిట నాటకం ఆడుతున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 43వ బూత్‌శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ఆర్‌పీ జయంత్‌లాల్ అధ్యక్షతన ప్రజాగోస-బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ముఖ్యఅతిథులుగా గుజ్జుల, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి హాజరయ్యారు. అనంతరం ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా నిరాశపర్చి కేసీఆర్ సర్కార్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రతిపథకంపై ప్రజలకు చైతన్యం కలిగించాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపై ఉందన్నారు. బీజేపీకి ప్రజలలో పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేకనే బీఆర్ఎస్ దాడులకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్స్ కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణచారి, నియోజకవర్గ కో కన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, నాయకులు వెంకటస్వామి, మార్త రాజభద్రయ్య, విజయ్‌కుమార్, దార్న నారాయణదాసు, గోపినాథ్, పురుషోత్తం, రాజు, రంజిత్ పాల్గొన్నారు.

అభివృద్ధి శూన్యం

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి విమర్శించారు. మండలకేంద్రంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ఉప్పు రాజు, పత్తిపాకలో కానుగుల నాగరాజు అధ్యక్షతన బుధవారం కార్నర్ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. శాయంపేట నుంచి ఆత్మకూర్ వరకు ఏళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం సిగ్గు చేటన్నారు. మండలానికి 108 అంబులెన్స్ సౌకర్యం లేకపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, మొగిళి, రవికిరణ్, శ్రీకాంత్, రామకృష్ణ, రాకేష్‌రెడ్డి, స్వరూప పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న మురళీధర్‌గౌడ్



శాయంపేట : మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

దేశ ప్రజల ఆత్మబంధువు ప్రధాని మోదీ

ఎల్కతుర్తి : దేశ ప్రజల ఆత్మబంధువు ప్రధాని నరేంద్ర మోదీ అని హన్మకొండ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని చింతలపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాగోస-బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రం ఏర్పాటు బిల్లుకు అనుకూలంగా బీజేపీ ఓటు వేసిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందంటే కేంద్రం నిధులతోనే అని గుర్తు చేశారు. సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గ నేత చాడ శ్రీనివాస్‌రెడ్డి, కుడితాటి కరుణాకర్, వాంకె రవీందర్, రమేష్, జనగాని కిష్టయ్య, దండ దేవేందర్‌రెడ్డి, గొర్రె ఆదామ్, చిదురాల వెంకటేష్, కృపాకర్, భగవాన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ప్రధాన శత్రువు బీజేపీ

ధర్మసాగర్ : అధికారంలోకి వచ్చిన బీజేపీ 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మాదిగలను మోసం చేస్తుందని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు మార్చి 15న జరిగే రాష్ట్ర హైదరాబాద్ దిగ్బంధం విజయవంతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మాదిగల సంగ్రామ పాదయాత్రలో భాగంగా బుధవారం ధర్మసాగర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్ ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ మాదిగలకు రావాల్సిన రిజర్వేషన్ వాటా రాకుండా విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో, అభివృద్ధిలో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న మంద కుమార్ మాదిగ

వర్గీకరణ చేయకుండా మదిగలను మోసం చేస్తున్న బీజేపీ వైఖరికి నిరసనగా హైదరాబాద్ దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జన్ను దీనేష్, మంద రాజు, గంగారపు శ్రీనివాస్, బొచ్చు తిరుపతి, బొడ్డు శాంతిసాగర్, చింత శ్రీనివాస్ గౌడ్, సురుగూరి కమలాకర్, కొట్టె కళ్యాణ్, చిలుక రాజు, ఆకునూరి రమ, గొర్రె స్వప్న, పుట్ట ప్రశాంత్, చింత చంటి, పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో శ్రీహరి ప్రతిభ



శ్రీహరిని సన్మానిస్తున్న ఎల్ఐసీ అధికారులు

పరకాల: హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్ర నగరంలోని అథ్లెటిక్ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగిన 4వ జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ 2023 పోటీల్లో రాష్ట్రం తరపున బరిలో నిలిచిన పరకాల ఎల్ఐసీ బ్రాంచి ఉద్యోగి బలభక్తుల శ్రీహరి అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. 110 మీటర్ల హర్డిల్స్ విభాగంలో సిల్వర్ మెడల్, 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణపతకం కైవసం చేసుకున్నాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన శ్రీహరిని బుధవారం పరకాల ఎల్ఐసీ కార్యాలయంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కె.ఎస్ ఇలంగోవన్‌తో పాటు ఎల్ఐసీ ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీరమ, బి.రాజ్‌కుమార్, ఏబీఎం ఏ.అరుణమిత్ర, ఆర్.భగవన్ కుమార్, వి.చాణక్య గుప్తా, సీహెచ్.పాపిరెడ్డి, లియాఫీ పరకాల అధ్యక్షుడు బూర బాబు, అశోక్‌రావు, యుగేంద్రచారి, ఏజెంట్లు పాల్గొన్నారు.

సభాస్థలిని పరిశీలించిన నేతలు



సభ స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ధర్మసాగర్(వేలేరు): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 27న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా వేలేరు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభ స్థలాన్ని రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రులు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బుధవారం సందర్శించి పరిశీలించారు. శంకుస్థాపన కార్యక్రమాల ఏర్పాట్లు, బహిరంగ సభ స్థలం, పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. బహిరంగ సభకు వచ్చే జనానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్, ఇతర ప్రభుత్వ అధికారులకు, బీఆర్ఎస్ శ్రేణులకు పలు సూచనలు చేశారు. వారి వెంట జనగాం జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారెపెల్లి సుధీర్ కుమార్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, సెంట్రల్ జోన్ డీసీపీ మహ్మద్ అబ్దుల్ బారీ, ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, తదితరులు ఉన్నారు.

న్యాయవాదిపై దాడిచేసిన వారిని శిక్షించాలి



పరకాల: రంగారెడ్డి జిల్లాలో బార్ అసోసియేషన్ సభ్యుడు నరపాక సురేందర్‌పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్ అన్నారు. న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ పరకాల కోర్టు విధులకు గైర్హాజరయ్యారు. గేట్ ధర్నా చేపట్టిన అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశాన్ని ఉద్దేశించి శ్రీనివాస్ మాట్లాడారు. న్యాయవాదులు రాజిరెడ్డి, ఒంటేరు రాజమౌళి, వి.చంద్రమౌళి, కె.శ్రీనివాస్, బందెల స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



ఎల్కతుర్తి : గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న జిల్లా అధికారి డాక్టర్ వెంకట్‌నారాయణ



శాయంపేట : పెద్దకోడెపాకలో..

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని పశువైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం గొర్రెలకు నట్టలనివారణ మందు పశుసంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ వెంకట్ నారాయణ వేశారు. గొర్రెలు కొత్త మేత మేయడం, లేతమట్టి తినడం వల్ల నట్టలు బలుస్తాయన్నారు. ముందస్తు నివారణ చర్యగా నట్టల నివారణ మందు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి రోజు 4,100 గొర్రెలకు మందు వేసినట్లు వైద్యాధికారిణి దీపిక తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాకలో మేకలకు, గొర్రెలకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నట్టల నివారణ మందు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ సునీల్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల గొల్ల కురుమ, యాదవ సోదరులకు ప్రభుత్వం నుంచి ఉచితంగా అందించే నట్టల మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఎల్ఓ రమేష్‌బాబు, జేవీఓ సారంగం, యాదవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్

ధర్మసాగర్ : సమాచార హక్కు చట్టం పర్యవేక్షణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారాబత్తుల అనంతచారి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మాదాసి ప్రశాంత్, కార్యదర్శిగా గూడూరు ప్రణయ్‌ని నియమించినట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కక్ర రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తూ సమాచారం కోసం దరఖాస్తుల విన్నపం, స్వచ్ఛంద సమాచారం, రికార్డుల తనిఖీ, సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కల్పిస్తూ అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ జిల్లాలో జరుగుతున్న అవినీతిని అరికడతామని అన్నారు. అనంతరం వారికి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో వక్కల అశోక్, గూడూరు రాజు, ముంజ కుమార్, వక్కల సుమన్, దుస్స శ్రీధర్, జోగు ప్రశాంత్, చిట్యాల కృపానంద్, జోగు సందీప్, గాజుల సదానందం, కొలిపాక భాస్కర్, కొలిపాక రాంప్రసాద్ పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

క్రైం కార్నర్

మద్యం షాపులో చోరీ



దామెర: మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఎస్ఎస్ వైన్స్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి మద్యం బాటిళ్లతో పాటు నగదు అపహరించిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. షాపు నిర్వాహకుడు సందెల సునీల్ తెలిపిన కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి షాపు మూసివేసిన అనంతరం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు పైభాగంలో ఉన్న రేకులకు ఉన్న నట్లను స్పానర్ల సాయంతో తీసివేసి రేకులను తొలగించి షాపులోకి చొరబడ్డారు. అనంతరం షాపులోని అధిక రేట్లు కలిగిన సుమారు రూ.48,390 విలువచేసే మద్యం బాటిళ్లు, కూల్ డ్రింక్స్,హోల్‌సేల్, రిటేల్ కౌంటర్లలో ఉన్న రూ.26,710 నగదు, సీసీ కెమెరాల క్లిప్‌లు నిక్షిప్తమై ఉన్న వీఆర్ బాక్సును అపహరించుకొని వెళ్లినట్లు తెలిపాడు. బుధవారం ఉదయం గుమస్తా షాపును తెరిచి చూడగా దొంగలు పడ్డట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సునిల్ ఫిర్యాదు మేరకు ఆత్మకూర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సీఐ జగన్నాథరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

బైక్ అదుపుతప్పి వైద్యురాలికి తీవ్రగాయాలు

దామెర : బైక్ అదుపుతప్పి వైద్యురాలికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో 163 జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన డాక్టర్ సంధ్యారాణి ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో కాంట్రాక్ట్ వైద్యురాలిగా పనిచేస్తుంది. విధులు ముగించుకొని పరకాల నుంచి హనుమకొండకు ద్విచక్రవాహనంపై వెళ్తుంది. ఒగ్లాపూర్ సమీపంలోని ఎస్‌బీఐటీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కిందపడింది. దీంతో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనం చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఆర్‌బీఎస్‌కే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుండా రవీందర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

యువకుడికి తీవ్రగాయాలు

దామెర: లారీ కిందికి బైక్ దూసుకెళ్లిన ఘటనలో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని ఒగ్లాపూర్ స్టేజీ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన కథనం ప్రకారం...నగరంలోని మూడో డివిజన్ ఆరెపల్లికి చెందిన మంగ కార్తీక్ శాయంపేట మండలం కొప్పులలోని దేవాదుల(మెగా) కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి నైట్ డ్యూటీలో భాగంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో ఒగ్లాపూర్ స్టేజీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాలే బైక్‌పై వస్తున్న కార్తీక్ లారీ కిందికి వెళ్లాడు. దీంతో ఆతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

మొరం తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారు పరిధిలోని గుట్టల్లో రాత్రివేళలో అక్రమంగా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లను మంగళవారం రాత్రి పట్టుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్ యూనిట్ సీఐలు రాకేష్, అనిల్ తెలిపారు. పెద్ద మొత్తంలో అక్రమంగా మొరం తరలిస్తున్నారని సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అక్రమంగా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి, స్టేషన్ ఇన్‌చార్జ్ వెంకట్రాంనాయక్‌కు అప్పగించినట్లు వారు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత వస్తువులను వాడాలి



స్టీల్ పాత్రలను ప్రదర్శిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆత్మకూరు : ప్రజలు క్రమంగా తమ నిత్యజీవితంలో ప్లాస్టిక్ రహిత వస్తువులను వినియోగించడం అలవాటు చేసుకోవాలని మండల పంచాయతీ అధికారి సి.చేతన్‌రెడ్డి అన్నారు. ఓడీఎఫ్ ప్లస్ లక్ష్యాల సాధనలో భాగంగా ఆత్మకూరు, లింగమడుగుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందుగా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో, సమావేశాల్లో ఎప్పటికీ స్టీల్ ప్లేట్లు, టీ గ్లాసులు, జగ్గులు, తాగునీటి గ్లాసులు వాడాలని సూచించారు. స్వచ్ఛ భారత్ ప్రతినిధి సంపత్‌కుమార్ మట్లాడుతూ గ్రామాల్లో జరిగే శుభకార్యాల్లో ప్లేట్లు, గ్లాసులు స్టీల్‌వే వాడాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు ఎంపీఓ రవిబాబు, ఏపీఓ రవికుమార్, శ్రీనివాస్, ఆత్మకూరు, లింగమడుగుపల్లి పంచాయతీ కార్యదర్శులు మేడ యాదగిరి, కొత్తపల్లి లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన

శాయంపేట : పంటలకు సాగునీరు అందించడానికి డీబీఎం 31, 10 ఆర్ కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా పంటలకు సాగు నీరందిస్తుండగా 10ఆర్ కాల్వ పక్కన ఆయకట్టు రైతులు మొక్కజొన్న పంటసాగు చేశారు. ప్రస్తుతం మొక్కజొన్న మధ్యస్థ దశలో ఉందని, కొన్నిచోట్ల పీచు వేసే దశకు చేరుకున్నాయని రైతులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి సాగునీరు సరఫరా కాకపోవడంతో పంటలుఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సారెస్పీ అధికారులు స్పందించి ఉపకాల్వల ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.



10 ఆర్ కాలువకు రాని ఎస్సారెస్పీ నీరు

కంపోస్ట్ వేస్ట్ తయారీపై అవగాహన

హన్మకొండ అర్బన్: బాలసముద్రంలోని జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంపోస్ట్ యార్డులో బుధవారం కంపోస్ట్ వేస్ట్ తయారీపై మున్సిపల్ జవాన్లు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్ ఇండియా వరంగల్ లోకల్ చాప్టర్, ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ వాహనాల ద్వారా సేకరించిన వేస్ట్‌ను కంపోస్ట్ బెడ్‌లో ఒక పద్ధతి ప్రకారం వేసి యాజమాన్య పద్ధతులను వివరిస్తూ అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షులు

అంతర్జాతీయ సదస్సుకు కిట్స్ అధ్యాపకులు



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హసన్‌పర్తి: కిట్స్ కళాశాల మ్యాథ్స్‌అండ్ ఫిజికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ గ్రేస్ శాంతి, డాక్టర్ బంటి రాయ్‌లు రూపొందించిన పరిశోధన పత్రం అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. 'భారతీయ సాంకేతిక భాషను ఉపయోగించి చెవిటి, మూగ వారికి కృత్రిమ మేధస్సు' అనే పరిశోధన పత్రం మార్చి మొదటి వారంలో ఆస్ట్రేలియాలో జరిగే అంతర్జాతీయ సదస్సులో సమర్పిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గ్రేస్ శాంతి, డాక్టర్ బంటి రాయ్‌లను ప్రిన్సిపాల్‌తో పాటు సహ అధ్యాపకులు అభినందించారు.

స్వేరోస్ ఫెల్లోషిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలి

విద్యారణ్యపురి: మెడిసిన్, ఇంజనీరింగ్, ఎంబీఏ, పీజీ, డిగ్రీ చదువుతూ 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు స్వేరోస్‌ఫెల్లోషిప్ కోసం ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్వేరోస్ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అలూమ్ని అసోసియేషన్ నిరుపేదల విద్యార్థులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తోందన్నారు. పూర్తి వివరాలకు స్వేరోస్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.